రూ.77లక్షలతో జిమ్‌లు, చిల్డ్రన్ పార్కులు

సికింద్రాబాద్ : నియోజకవర్గంలోని పది ప్రాంతాల్లో ఓపెన్ జిమ్‌లు, చిల్డ్రన్ పార్కులు ఏర్పాటు చేయడానికి జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకు జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయ అధికారులు రూ.77లక్షల నిధులు మంజూరు చేశారు. అడ్డగుట్ట సమోసా గార్డెన్, శాంతినగర్ శివాలయం సమీపంలోని వ్యాయామశాల ప్రాంతంలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తారు. తార్నాక డివిజన్ నాగార్జుననగర్ పార్కు, ప్రొ.జయశంకర్ స్టేడియంలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తారు. మెట్టుగూడ డివిజన్ న్యూ మెట్టుగూడ పార్కులో ఓపెన్ జిమ్, చిల్డ్రన్‌పార్కును ఏర్పాటు చేస్తారు. సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్ పార్కులో ఓపెన్ జిమ్, టీఆర్‌టీ కాలనీ ప్కాలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయనున్నారు. బౌద్ధనగర్ డివిజన్ దుర్గామాత గుడి సమీపంలోని ఎస్‌బీఐ కాలనీ పార్కు, రోడ్డు నెంబర్ 5లోని జీహెచ్‌ఎంసీ పార్కులో ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు. కొద్ది రోజుల్లో ఓపెన్ జిమ్‌లు, చిల్డ్రన్ పార్కుల ఏర్పాటు పనులు ప్రారంభిస్తామన్నారు.

టీఆర్‌టీ పార్కును అందుబాటులోకి తెస్తాం


టీఆర్‌టీ పార్కును పరిశీలిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ టీఆర్‌టీ క్వార్టర్స్‌లోని జీహెచ్‌ఎంసీ పార్కును త్వరలో ప్రజలకు అందుబాటులోకి తేనున్నామని కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. గురువారం కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ఆమె పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీఆర్‌టీ కాలనీవాసులు సాయంత్రం సమయాల్లో పార్కులో సేద తీరేందుకు బెంచీలు తదితర వసతులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌టీ కాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బన్సీలాల్‌పేట్‌లో 'బస్తీ అభియాన్'


బన్సీలాల్‌పేట్‌లో పర్యటిస్తున్న చీర సుచిత్రశ్రీకాంత్

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో గురువారం బీజేపీ నాయకులు బస్తీ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రవాసీ బస్తీ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్రశ్రీకాంత్ వివిధ బస్తీల్లో పర్యటించారు. పోలింగ్ బూత్ 88 పరిసర ప్రాంతాల్లో పార్టీ శ్రేణులతో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకొని ప్రయోజనం పొందాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు, కార్యక్రమాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు అందజేస్తుందన్నారు. కేంద్రంలోని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం.. దేశాభివృద్ధికి నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమేస్ ఖండేల్వాల్, రమణయాదవ్, ప్రవీణ్, ప్రసాద్, స్వప్న, కోమల్, నరేంద్రపాల్, జై కిషన్, ధనరాజ్ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి


సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

బన్సీలాల్‌పేట్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని నిరసిస్తూ ఈ నెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని గురువారం సాయంత్రం ఆర్టీసీ రాణిగంజ్ డిపో ఆవరణలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సురేష్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సురేష్ పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల భారత న్యాయసహిత 2023లో తీసుకువచ్చిన చట్టంలో హిట్ అండ్ రన్ కేసుకు సంబంధించి సెక్షన్ 106 1,2లతో 10 సంవత్సరాలు జైలు శిక్ష, జరిమానాలను విధించిందన్నారు. ఈ చట్టం కార్మికులకు గుదిబండగా ఉందన్నారు. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 16న చేపట్టిన సమ్మెలో ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రిజర్వేషన్ కౌంటర్ల మూసివేత..

ప్రయాణికుల వెత

- సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్‌లో ఇదీ పరిస్థితి
- రిజర్వేషన్ సదుపాయం కోసం ఎదురుచూపులు


మూసి ఉంచిన కౌంటర్

సికింద్రాబాద్: ప్రయాణికుల రాకపోకలతో ప్రగతి సాధిస్తున్న సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్‌లో రిజర్వేషన్ సదుపాయం లేకపోవడంతో ప్రజలు నిరాశకు గురవుతున్నారు.ఈ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సంఖ్య పెరగడంతో పాటు అధునాతన వసతులు అందుబాటులోకి వచ్చాయి. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా రైల్వే అధికారులు ఇక్కడ ఏర్పాటు చేస్తున్న వసతులు ప్రయాణికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సికింద్రాబాద్ జంక్షన్ పరిసర ప్రాంతాల్లో పలు రైల్వేస్టేషన్లు ఉన్నప్పటికీ రైళ్ల రాకపోకలు, ప్రయాణికుల తాకిడి సీతాఫల్‌మండి స్టేషన్‌కు ఎక్కువగా ఉండడం గమనార్హం. అంతేకాదు ఎక్కువ సంఖ్యలోని ఎంఎంటీఎస్ రైళ్ల రాకపోకలకు కేంద్రంగా మారిన సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్ ప్రత్యేకతను చాటుకుంటోంది.

40 ఎంఎంటీఎస్‌ల రాకపోకలు

నాలుగు ప్లాట్‌ఫాంలతో కూడిన ఈ రైల్వేస్టేషన్ నుంచి 40 ఎంఎంటీఎస్, 20 వరకు సాధారణ, ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. రెండు వేలకు పైచిలుకు ప్రయాణికులు వచ్చి వెళ్తుంటారు. మరో అదనపు లైన్ నిర్మాణం కోసం పనులు జరుగుతున్నాయి. రెండు పుట్ ఓవర్ వంతెనలు, రెండు ప్రవేశ ద్వారాలు, మూడు అధునాతన లిఫ్టులను రైల్వే అధికారులు ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినా బ్యాకప్‌తో నడిచే లిఫ్టులు ఏర్పాటు చేసిన ఫలితంగా వృద్ధులు, పిల్లలతో వచ్చే మహిళలకు ఇబ్బందులు తప్పాయి. ఎంఎంటీఎస్‌లతోపాటు మహబూబ్‌నగర్, నిజామాబాద్, మనోహరాబాద్, నాందేడ్, మేడ్చల్, వాడి, పెద్దపల్లి తదితర మార్గాలకు కాచిగూడ నుంచి వెళ్లే అన్ని రైళ్లను ఇక్కడ నిలుపుతున్నారు. దీంతో సీతాఫల్‌మండి, వారాసిగూడ, తార్నాక, చిలకలగూడ, మెట్టుగూడ తదితర ప్రాంతాల ప్రజలు ఇక్కడి నుంచి వివిధ మార్గాలకు ప్రయాణాలు చేస్తున్నారు. నగరంలోని ఏ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్‌లో లేని విధంగా సీతాఫల్‌మండిలో స్టేషన్‌కు రెండు వైపులా విశాలమైన పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేశారు.

కౌంటర్లను తెరవాలి..

రైలు ప్రయాణికులకు అన్ని రకాల సంతృప్తికర సేవలు అందిస్తున్న సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్ సేవలు అందుబాటులోకి రాకపోవడంతో ఈ ప్రాంత ప్రజలకు ఇబ్బందుల పాలవుతున్నారు. కరోనా లాక్‌డౌన్ ముందు వరకు ఈ రైల్వే స్టేషన్‌లో దేశవ్యాప్తంగా అన్ని రైళ్లకు టికెట్ రిజర్వేషన్ సేవలు ఇక్కడ అందుబాటులో ఉండేవి. లాక్‌డౌన్ పరిస్థితులతో మూతపడిన రిజర్వేషన్ కౌంటర్ సేవలు నేటికీ పునరుద్ధరించలేదు. గత్యంతరం లేక ఈ ప్రాంత ప్రజలు రద్దీగా ఉండే సికింద్రాబాద్ రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను లేదా కాచిగూడ రైల్వేస్టేషన్‌ను ఆశ్రయించాల్సి వస్తుంది. సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్‌లో రిజర్వేషన్ సేవల కౌంటర్‌ను అందుబాటులోకి తీసుకువస్తే ప్రయాణికుల సౌకర్యవంతంగా ఉంటుందని ప్రయాణికులు కోరుతున్నారు.

లష్కర్ ఓటర్ల తుది జాబితా విడుదల


ఓటరు జాబితాను నోటీసు బోర్డులో పెట్టిన అధికారులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గం ఓటర్ల జాబితా తుది ప్రచురణ ప్రతులను గురువారం జీహెచ్‌ఎంసీ ఎన్నికల విభాగం అధికారులు విడుదల చేశారు. ఇప్పటికే చిరునామాల మార్పులు, తప్పొప్పుల సవరణలు, కొత్త పేర్ల నమోదు, తొలగింపుల అనంతరం కొత్త జాబితాను రూపొందించినట్లు సికింద్రాబాద్ సర్కిల్ ఎన్నికల అధికారి ఎస్.సుధాంశ్, ప్రత్యేక అధికారి మైఖేల్‌బోస్ తెలిపారు. జీహెచ్‌ఎంసీ కార్యాలయంలోని నోటీసు బోర్డులో సందర్శకుల కోసం ఓటర్ల జాబితాను ఉంచడంతోపాటు అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులకు జాబితా కాపీని అందిస్తామన్నారు. 2024 తుది ఓటర్ల జాబితా ప్రకారం నియోకవర్గ ఓటర్ల సంఖ్య 2,67,282కు చేరింది. పురుషులు 1,33,650, స్త్రీలు 1,33,607, ఇతరులు 25 మంది ఉన్నారు. ఓటర్ల సంఖ్య ప్రాతిపదికన పోలింగ్ స్టేషన్లు, బూత్‌ల ఎంపిక ప్రక్రియను కూడా పూర్తి చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఐదు మున్సిపల్ డివిజన్లలోని 102 భవనాల్లో 220 పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేశారు. ఓటర్లు తమ జాబితాలో పేర్లు పరిశీలించుకోవాలని అధికారులు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సెక్షన్ ఇన్‌చార్జి కే.భుజేందర్‌బాబు, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పరిశోధనలు సమాజాభివృద్ధికి ఉపయోగపడాలి


సెమినార్‌లో ప్రసంగిస్తున్న ప్రొ. దేవరాజ్ రాంబాబు

లాలాపేట: పరిశోధనలు సమాజాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలని డైరెక్టర్-ఇన్నోవేషన్, సైంటిఫిక్ అఫైర్స్ పల్స్ ఫార్మాస్యూటికల్స్ ప్రొఫెసర్ దేవరాజ్ రాంబాబు అన్నారు. తార్నాకలోని సరోజిని నాయుడు వనిత ఫార్మసీ మహావిద్యాలయలలో 'క్లినికల్ ట్రయల్స్ ఫార్మా స్యూటికల్స్ అడ్వాన్స్‌డ్ 'అనే అంశంపై మూడు రోజుల నేషనల్ సెమినార్ ముగిసింది. ఈ కార్యక్రమానికి డా.ఐరావతమ్స్ క్లినికల్ ల్యాబోరేటరీ డైరెక్టర్ చిత్ర చంద్రశేఖర్, మహా విద్యాలయ చైర్మెన్ ప్రభా శంకర్‌తో కలిసి దేవరాజ్ పాల్గొని మాట్లాడారు. ఇలాంటి సదస్సులు క్లినికల్ ట్రయల్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు దోహదపడుతాయన్నారు. విద్యార్థులు నేర్చుకున్న కోర్సులు ప్రాక్టికల్స్ కమర్షియల్‌గా జరగాలని తద్వారా టెక్నాలజీని ఉపయోగించుకుని తక్కువ సమయంలో సొసైటీకి అవసరమైన మందులు మార్కెట్‌లోకి రావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాంప్రసాద్ రెడ్డి, సాయినాథ్ దయాకర్, జయరాజ్, ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సరిత జోష్ణ, కో కన్వీనర్ మమత, శిరీష, వివేక్ సాగర్ పాల్గొన్నారు.

రేపు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

సనత్‌నగర్: ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఆయుర్వేద హాస్పిటల్ వారి సహకారంతో మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి, ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబులు తెలిపారు. మోడల్‌కాలనీలోని సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ శిబిరంలో ఆయుర్వేద వైద్యులు హాజరై ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేస్తారన్నారు.

రేపు బీఆర్‌ఎస్ పార్టీ విజయోత్సవ సభ

సనత్‌నగర్: నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్ పార్టీ విజయోత్సవ సభ ఈ నెల 10న ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్‌లోని మహబూబ్ కళాశాలలోని ఎస్‌వీఐటీ ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు హాజరవుతారు. నియోజకవర్గ పరిధిలోని పార్టీ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరవ్వాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు.

15న సెలవు దినంగా ప్రకటించాలి


శ్రీకాంత్

అడ్డగుట్ట: బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి రోజున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని సేవాలాల్ లంబాడా వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శ్రీకాంత్ నాయక్ ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 15న సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఆ రోజును రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలన్నారు. అదే విధంగా సేవాలాల్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బంజారాలు కోరుతున్నారన్నారు.

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం


ఇన్‌స్పెక్టర్ రాంబాబును కలిసిన ఆటో డ్రైవర్లు

లాలాపేట: ఆటోలు నడుపుతూ జీవనం సాగిస్తున్న తమ లాంటి వారిపట్ల ట్రాఫిక్ పోలీసులు కొంత సానుభూతితో వ్యవహరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యులు బెజ్జాల కృష్ణమూర్తి అన్నారు. ఈ మేరకు ఇటీవల నల్లకుంట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా వచ్చిన డి. రాంబాబును తార్నాక, లాలాపేట, శాంతినగర్ తదితర ప్రాంతాలకు చెందిన ఆటో డ్రైవర్లు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, బాల్‌రాజు, మధు, కరీం, శంకర్, రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ అధ్యక్షుడిగా మనోజ్‌కుమార్


నియామక పత్రాన్ని అందుకున్న మనోజ్‌కుమార్

బన్సీలాల్‌పేట్: సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఏ-బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఓల్డ్ బోయిగూడకు చెందిన టి. మనోజ్‌కుమార్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్ మాట్లాడుతూ.. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం ద్వారా ప్రజలకు పార్టీని మరింత చేరువ చేసే విధంగా చూస్తానన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేసే విధంగా నిరిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతానన్నారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్, సనత్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఓయూలో 27, 28 తేదీల్లో సాంస్కృతిక పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీలను ఈ నెల 27, 28 తేదీలలో ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు అధికారులు గురువారం పేర్కొన్నారు. మార్చిలో జరగనున్న యూనివర్సిటీ ఓపెన్ డే, ఉస్మానియా తక్ష్-2024 భాగంగా సాంస్కృతిక పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల క్యాంపస్ కాలేజీలతో పాటు అనుబంధ, ప్రవేటు కాలేజీల విద్యార్థులు ఈ నెల 22 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. డ్యాన్స్, మ్యూజిక్, ఫైన్ ఆర్ట్స్, థియేటర్ ఆర్ట్స్, లిటరరీ పోటీలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

బస్ షెల్టర్లను ఆక్రమిస్తే చర్యలే..

లాలాపేట: ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్ షెల్టర్లను ఆక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలుంటాయని నల్లకుంట ట్రాఫిక్ ఎస్సై నిరంజన్ తెలిపారు. లాలాపేటలోని ఆర్టీసీ బస్ షెల్టర్‌లో సుదీర్ఘకాలంగా తిష్టవేసిన పలు ఆక్రమణలు, ప్రైవేట్ వాహనాలను గురువారం ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. బస్ షెల్టర్‌లో వ్యాపారాలు చేయరాదని ఆటోలు, ప్రైవేట్ వాహనాలను నిలుపరాదని హెచ్చరించారు. చాలాకాలంగా లాలాపేట ఆర్టీసీ బస్ షెల్టర్‌లో కొందరు తమ వాహనాలు నిలపడం. వ్యాపారాలు చేసుకుంటుండటంతో ఇటీవల స్థానికులు నల్లకుంట ట్రాఫిక్ పోలీసులు, కుషాయిగూడ బస్ డిపోలో ఫిర్యాదు చేశారు. ఈ సమస్యపై గతంలో పలుమార్లు సాక్షి కథనాలు సైతం ప్రచురితమయ్యాయి. ఎట్టకేలకు స్పందించిన ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు.

గదుల కేటాయింపులో వివక్ష తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీలోని భౌతిక శాస్త్రం విభాగంలో అధ్యాపకులకు గదుల కేటాయింపులో వివక్షత చూపడం తగదని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కళ్యాణ లక్ష్మీ పేర్కొన్నారు. విభాగంలో అన్ని వసతులు గల సెఫ్టీ గదిని తనకు కేటాయించాలని ఫిజిక్స్ హెడ్ ప్రొ.శ్రీనివాస్‌ను కోరగా నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వైద్యరత్న అవార్డులు అభినందనీయం

మంత్రి దామోదర రాజనర్సింహా

శ్రీనగర్‌కాలనీ: వైద్యరంగంలో విశిష్ట సేవలు అందించిన వైద్యులకు వైద్యరత్న అవార్డులు ఇచ్చి సత్కరించిడం శుభపరిణామమని, ఇప్పటికే నాలుగు పర్యాయాలు వైద్యరత్న అవార్డులను అందించిన జేఎంజీ గ్రూప్స్ కృషి ప్రశంసనీయమని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో 2024 సంవత్సరానికిగాను వైద్యరత్న అవార్డుల పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. కరోనా సమయంలో వైద్యుల సేవలు మరువలేనివని, అలాంటి వైద్యులకు ఇలాంటి అవార్డులను అందించడం అభినందనీయమన్నారు. జేఎంజీ గ్రూప్స్ సీఈఓ ఎం.జగన్ మాట్లాడుతూ... 2015 నుంచి వైద్యరత్న అవార్డులను అందిస్తున్నామని, 5వసారి ఈ అవార్డుల ప్రక్రియను కొనసాగిస్తున్నామన్నారు. కరోనాలో విశిష్ట సేవలు చేసిన డాక్టర్లను ఘనంగా సత్కరించామని, ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియను మొదలుపెట్టామని, ఫిబ్రవరి 29 వరకు నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. మార్చి 21న వైద్యరత్న అవార్డులను మంత్రి దామోదర రాజనర్సింహా చేతులమీదుగా అందజేస్తామన్నారు. జేఎంజీ గ్రూప్స్ డైరెక్టర్ నీలిమ, పవన్, యూఆర్‌ఆర్ గ్రూప్స్ ఎండీ పరుపాటి శ్రీనివాసరెడ్డి, ఐకానిక్ ఎండీ శ్రీనివాసగౌడ్, వెరొనిక ఈవెంట్స్ ఎండీ సుమన్ పాల్గొన్నారు.

'శాంతిశిఖర' అభివృద్ధికి కట్టుబడి ఉన్నా: ఎమ్మెల్యే దానం

పంజగుట్ట: తమ కాంప్లెక్స్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సోమాజిగూడ శాంతి శిఖర అపార్ట్‌మెంట్ (ఎస్‌ఎస్‌ఏ) కార్యవర్గ సభ్యులు గురువారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఎస్‌ఏ గౌరవాధ్యక్షుడు రమేష్ హజారి ఆధ్వర్యంలో బృందం దానం నాగేందర్‌ను ఘనంగా సత్కరించారు. గతంలో ఎన్నికల సమయంలో దానం నాగేందర్ తమ అపార్ట్‌మెంట్‌కు వచ్చి ఇచ్చిన హామీలు, అభివృద్ధి కార్యక్రమాల గూర్చి చర్చించి వారిని పూర్తి చేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. శాంతి శిఖర కాంప్లెక్ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని, త్వరలోనే అపార్ట్‌మెంట్‌కు వచ్చి సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ధని ఏలే, కార్యదర్శి అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు ప్రభాత్, కోశాధికారి మాధవ్‌రెడ్డి, సభ్యురాలు పద్మజ తదితరులు పాల్గొన్నారు.

కులగణనకు చట్టబద్ధత కల్పించాలి

కాచిగూడ: అసెంబ్లీ సమావేశాల్లో కులగణనపై గవర్నర్ చేసిన ప్రసంగంలో అనేక అనుమానాలు ఉన్నాయని, కులగణనకు చట్టబద్ధత తీసుకురావాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, యూనైటెడ్ పూలే ఫ్రంట్ కో కన్వీనర్ ఆర్.వి.మహేందర్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం నారాయణగూడలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టనున్న కులగణన విషయంలో స్పష్టతను తీసుకువచ్చి ప్రజల్లో ఉన్న ఆందోళనను తొలగించాలని అన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో మహాత్మ జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పూలే దంపతుల విగ్రహం ఏర్పాటు చేసే వరకు ఉద్యమం కొనసాగిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాజకీయాలకతీతంగా పూలే విగ్రహ ఏర్పాటుకు బీసీ అందరూ ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు సమష్టిగా పనిచేద్దాం

ముషీరాబాద్: కుష్టు వ్యాధిని భూస్థాపితం చేసేందుకు అందరూ సమష్టిగా పనిచేద్దామని డీపీఎంవో హరిచంద్రప్రసాద్ అన్నారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా గురువారం ముషీరాబాద్ ఆరోగ్య కేంద్రం పరిధిలోని అక్స్‌ఫర్డ్ స్కూల్‌లో విద్యార్థులకు స్పర్శ్ లెప్రసీ వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కుష్టు వ్యాధిని ప్రారంభదశలో గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చునన్నారు. ఇందుకు సంబంధించి మందులు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా లభ్యం అవుతాయన్నారు. అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీహెచ్‌ఎన్ భాగ్యలక్ష్మి, ఏఎన్‌ఎం విజయకుమారి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో సౌకర్యాల లేమి!

- శిథిలావస్థలో భవనాలు
- రేకులషెడ్లలో పాఠాలు
- ఇక్కట్లు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


శిథిలావస్థకు చేరిన కార్ఖాన ప్రాథమిక పాఠశాల భవనం


అన్నానగర్ బాలజ్యోతి పాఠశాల తరగతి గది ఇలా..

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలు వసతుల లేమితో కొట్టుమిట్టులాడుతున్నాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన రేకుల షెడ్లు, శిథిలావస్థకు చేరిన భవనాల్లో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. పలు పాఠశాలల్లో అరకొర వసతులు, తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్ల లేమి, బేంచీలు, కుర్చీల కొరతతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇక్కట్లకు గురవుతున్నారు. కొన్ని పాఠశాలలకు వేలాది రూపాయల విద్యుత్ బిల్లులు బకాయిలు ఉండడంతో సకాలంలో బిల్లుల నిధులు విడుదల కాక తరచూ విద్యార్థులు చీకట్లోనే చదువుకునే దుస్థితి నెలకొంటోంది. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకంతో తమ పిల్లలను తల్లిదండ్రులు చేర్పిస్తున్నా కనీస వసతులు కల్పించడంలో పాలకులు, అధికారులు విఫలమవుతున్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని మారేడుపల్లి, తిరుమలగిరి, సికింద్రాబాద్ మండలాల పరిధిలో మొత్తం 20 ప్రాథమిక, 13 ఉన్నత, 12 ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో మొత్తం తొమ్మిది వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ సారైనా ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

సమస్యలు ఉన్న పాఠశాలలు..

శిథిలావస్థకు చేరిన బొల్లారం జీహెచ్‌ఎస్ పాఠశాలలో 300 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాత భవనాన్ని కూల్చి నూతన భవనం నిర్మించాల్సిన అవసరం ఉంది. జీజీహెచ్‌ఎస్ పికెట్ పాఠశాలలో అదనపు తరగతి గదులు అవసరం కాగా ప్రస్తుతం ఉన్న తరగతి గదులు అధ్వానస్థితిలో ఉన్నాయి. ఈ పాఠశాలలో 250 మంది విద్యార్థులు ఉన్నారు. కార్ఖాన ప్రాథమిక పాఠశాల కొన్ని తరగతి గదులు రేకులషెడ్డులో మరికొన్ని గదులు శిథిలావస్థకు చేరిన భవనంలో కొనసాగుతోంది. మడ్‌ఫోర్ట్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో 1000 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే ఇక్కడ అదనపు తరగతి గదుల నిర్మాణం ఎంతో అవసరం. 600 మంది విద్యార్థులు చదువుతున్న జీబీహెచ్‌ఎస్ బోయిన్‌పల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలోని మూత్రశాలలు, మరుగుదొడ్లు అధ్వానంగా మారి వినియోగించుకోలేని స్థితికి చేరాయి. రిసాలబజార్ పాఠశాలలో 350 మంది విద్యార్థులున్నారు. శిథిలావస్థకు చేరిన భవనాన్ని కూల్చివేసి నూతన భవనం నిర్మించాలని కోరుతున్నారు.

మెరుగైన వసతుల కల్పనకు కృషి..



తన తండ్రి దివంగత ఎమ్మెల్యే సాయన్న హయాంలో నియోజకవర్గ అభివృద్ధి నిధులు రూ.10 లక్షలతో మడ్‌ఫోర్ట్ పాఠశాలకు ప్రహరీ నిర్మాణం, రూ. 40 లక్షలతో మహేంద్రహిల్స్ హాస్టల్ డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపించారు. మన ఊరు-మన బడి పథకం ద్వారా బొల్లారం, పికెట్ పాఠశాలల్లో విద్యార్థులకు బేంచీలు, కుర్చీలు సమకూర్చారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యాభివృద్ధికి నియోజకవర్గానికి విద్యాదీవెన పథకం కింద రూ. 2 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ పాఠశాలలలో మెరుగైన వసతులు కల్పనకు కృషిచేస్తా. -లాస్యనందిత, ఎమ్మెల్యే